
# అక్షర లక్షణ



అతడు కవి! సభలు సన్మానాలు జరిపించుకొని పేరుకు వెనకాముందు బిరుదులు వగైరాలు తగిలించుకోకపోయినా అతడు కవి.

అతడు పుట్టిన వేళావిశేషాన్ని గుణించి జాతకరీత్యా అతనికి తల్లిదండ్రులు పెట్టుకున్న పేరు ఉంది. ఆపేరు కాస్త మోటుగా చెవికి కటువుగా ఉంటే అతడు ముచ్చటపడి మార్చి పెట్టుకొన్న కలం పేరూ ఉంది. అయితే అందరూ అతన్ని 'కవిగారూ!' అని పిలుస్తుంటారు.

'కవియను నామంబు నీటికాకికి లేదే?' అని మన ప్రాచీన కవిశేఖరులు తమకు గిట్టని వాళ్ళను దృష్టిలో పెట్టుకొని అన్నారో ఏమో? అనిన వేళా విశేషం. కవివాక్కుకు కాలం చెల్లిపోలేదు. కానీ కవిగారు మాత్రం ఆకోవకు చెందిన కవి కాదు.

జీవితాన్ని కవిత్వానికే అంకితం చేసిన కవిగారికి అవగాహన ఉంది. ఆలోచన ఉంది. సామాజిక స్పృహ ఉంది. ఆవిష్కరించే తీరులో వైవిధ్యముంది. అన్నిటికి మించి తన కవిత్వాన్ని

తాను చక్కగా గానం చేయగల గళం ఉంది. అందుకే అంతవరకు చప్పగా సాగిన కవిసమ్మేళనం కవిగారు పైకి లేవడంతో ఊపు అందుకొంటుంది. చప్పట్లతో హాలు మారు మోగుతుంది!

చప్పట్లతో కడుపు నిండదని తట్టిన వాళ్లకు తెలుసు. కవిగారికీ తెలుసు!.

అయితే కవిగారు మాత్రం ఆ చప్పట్లు తన కవిత్వానికి ఆమోదమేకాకుండా ప్రేరణగా కూడా భావిస్తాడు. కడుపు నిండినట్లు తృప్తిపడుతున్నాడు.

తృప్తి మనిషి ఆనందానికి తొలిమెట్టే కాదు-మూలకారణమని కవిగారి భావన.

కవిగారుకూడా మనిషేకదా?

కవిసమ్మేళనంలో పొందిన అనుభూతి ద్వారా కలిగిన ఆనందాన్ని కవిగారు తనకు కప్పిన శాలువాలో భద్రంగా మూటగట్టు కొంటాడు. ఆగమేఘాల మీద ఇంటికి తిరిగివస్తాడు. అర్ధాంగితో ఆ ఆనందాన్ని పంచుకోవాలని ప్రయత్నిస్తాడు.

సరిగ్గా అదే సమయానికి కవిగారి సతీమణి కొంగున కట్టుకొన్న కష్టాలమూట విప్పుతుంది.

"ఏమండీ? కామధేనువులాంటి ఉద్యోగాన్ని వదులు కొన్నారా? కవిత్వాన్ని నమ్ముకొన్నారా? ఈ అంతఃపుర అధికారాన్ని నా చేతుల్లో పెట్టి కవితాసుందరిని భుజాలమీదికెక్కించుకొని ఊరేగుతున్నారా? ఒరిగిందేమిటో చెప్పండి? ఈ కవిత్వంతో కవి సమ్మేళనాలతో వచ్చే పాతికా పరకతో మూడు పూటలకొకపూటైనా కడుపార తినగలుగుతున్నామా? పోనీ తింటున్నామో పస్తులుంటున్నామో ఎవరు చూడొచ్చారు? చేతికెదిగొచ్చిన బిడ్డలున్నారు కదా? అందరూ ఆడపిల్లలే! అందరి కండ్లు వాళ్ళమీదనే! వాళ్ళను ఏ గంపకిందేసి మూసిపెట్టమంటారు చెప్పండి?" అంటూ నిలదీస్తుంది-అవధానంలో సమస్యాపృచ్ఛకుడిలా.

సామాన్యుడి అవగాహనకు అందని ఎన్నో సాంఘిక సమస్యలను గ్రహించి విశ్లేషించి వాటికి పరిష్కారమార్గాలు సూచించిన కవిగారు ఇంటిలో ఎదురైన సమస్యకు సరైన పరిష్కారాన్ని సూచించలేక నీళ్ళు నములుతూ నిలబడతాడు.

ఆమె పండ్లు పటపట కొరుకుతూ- "పొండి. ఎక్కడికి పోతారో పొండి. పోయి ఈ శాలువలు కడుపుకు కూడు పెట్టవు. కన్న సంతానానికొక దారిచూపించవు. ఈ శాలువలతో కప్పినా మా కష్టాలు దాగవు. పోనీ! అమ్ముకుందాంవన్నా కొనే వాళ్ళుందరు. అలాంటప్పుడు ఎందుకీ శాలువలు? మా కవిత్వాన్ని కొలవడానికి ఈ శాలువలే కొలబద్దలా? అని గొంతు చించుకొని చెప్పండి. చెప్పేటప్పుడు అది పద్యమో? వచనగీతమో? గద్యమో? వినేవాళ్ళకు అర్థమయ్యేటట్టు ఏడవండి" అంటూ అతడు తెచ్చిన శాలువను విసిరి అతని మొగాన్నే కొడుతుంది.

అంత అవమానం ఒక సామాన్యుడికే జరిగిఉంటే? అతడు సహించేవాడేనా? వెంటనే ఆమెపైకి విరుచుకపడడమో? లేదా తెగతెంపులు చేసుకొన్నట్లు వెళ్ళిపోవడమో? ఏదో ఒకటి తప్పనిసరిగా జరిగేది! అయితే ఆ తెగతెంపులు శాశ్వతం కాదని అతడికి తెలుసు. ఆమెకూ తెలుసు. అయినా ఇంటికి దూరంగా మనసుకు భారంగా తిరిగినంతసేపు పిచ్చిగా విరక్తిగా

తిరుగుతాడు. తిరుగుతూ తిరుగుతూ తనకు జరిగిన అవమానాన్ని తలపోస్తాడు. తలపోస్తూ తలపోస్తూ ఉండగానే బిడ్డలు... ఆస్తిపాస్తులు...ఆత్మీయతలు...అనురాగాలు అన్నీ ఆ తలపోతల్లోకి చాపకింద నీరులా జొరబడతాయి. కోపతాపాలు కొండెక్కిపోతాయి. అప్పుడు తలచుట్టి నోటివద్దకే వచ్చినట్లుగా తాను ఇల్లుచేరుతాడు.

అందుకే అతడు సామాన్యుడు.

ఇతడు కవి!

అంత చిన్న విషయానికే కోపగించుకుంటే అతడు కవిఎలా అవుతాడు? కవి అంటే ఓర్పుకు మారుపేరుకదా? అందుకే కవి హృదయం గతంలోకి పరుగులు తీసింది.

పెండ్లి అయిన తొలిరోజులు. ఆమె ఎదుటపడ్డే చాలు. నిరుపమానమైన అందం. అటుఇటు కదలకుండా నిలబెట్టేది. నిలబడి ఆ అందాన్ని ఆస్వాదిస్తూ ఉంటే గుండె పొంగు. ఆ పొంగులో కవిత్వం. ఆమె అందాన్ని వర్ణిస్తూ పద్యమో? గేయమో? పరవళ్ళు తొక్కేది. వింటూ ఆమె అరమోడ్పు కనులతో పరవశించేది. ఆ పరవశంలో నుండి ఉన్నట్లుండి కలగని మేల్కొన్నట్టు మేల్కొని చీరవిప్పి మొగాన కొట్టి పడకటింట్లోకి పరుగెత్తేది. పొగరుబోతు ఆంబోతులా వెంటపడితే–పడక మీద దృశ్యం కవిత్వంమీదకాదు. తన మగతనం మీదనే ఒక సవాలు!

అప్పట్లో అర్థంపరమార్థం అంతా అనుభవించడంలోనే!

ప్రాణంలేని మంచం కూడా మురిసినట్లు మూలిగేది. ఆ గదిలో ఒక మూల గూడు కట్టుకొన్న పిచ్చుకల జంట సిగ్గుపడినట్లు తుర్రుమని లేచిపోయేవి!

కవిత్వానికి తగిన బహుమతి ఇచ్చిన తృప్తి ఆమెకు! పొందిన తృప్తి తనకు!!

అదంతా ఇప్పుడేమయింది? ఏమయిందో అనుభూతిని కూడా మింగేస్తూ సంతానం నిలబడింది. వచ్చిన చిక్కంతా ఆ సంతానంతోనే!

అవును. తన కవిత్వం తనకు సంతానం. ఆమె సంతానమే ఆమెకు సర్వస్వం. తన కవిత్వాన్ని తాను ఆరాధిస్తున్నాడు. ఆమె సంతానాన్ని ఆమె ప్రేమిస్తున్నది. తన కవిత్వానికి తాను పేరు ప్రఖ్యాతులు రావాలని ఎలా ఆశిస్తున్నాడో అలానే ఆమె తన సంతానపురోభివృద్ధిని కాంక్షిస్తున్నది. తనదీ తప్పుకాదు. ఆమెదీ తప్పుకాదు.

ఒకనాటి ఆమె ప్రవర్తన రెచ్చగొట్టింది. ఇప్పుడు పిచ్చివాణ్ణి చేస్తూ ఉంది.

అర్థం పరమార్థం అంతా అర్థంగానే మిగిలిపోయింది. అవును. చచ్చినా డబ్బుకే పుడతామంటున్న లోకంలో ఆమెను తన కవిత్వం చుట్టూ తిరగమంటే తిరుగుతుందా? అది కుదురుతుందా? అది ఆమె తప్పుకాదు.

అయితే తప్పు ఎక్కడుంది? ఎక్కడో ఏదో ఒకతప్పు అన్నది లేకుంటే ఏబతుకులో అయినా ఎందుకు ఇబ్బందులుంటాయి? అయితే తన బతుకులో ఎక్కడో తప్పు ఉంది. అయితే ఆ తప్పు ఎక్కడుంది?

అప్పుడు కవిగారి చూపువిహంగం రెక్కలు విప్పి లోకంమీద ఎగురుతుంది.

ఈలోకంలో ఎందరో తనలాంటి కవులు! అయినా తనలా ఎందరు ఈ సమాజాన్ని గురించి ఆలోచిస్తున్నారు? అస్తవ్యస్థమైన ఈ సమాజంలో దోపిడీవ్యవస్థ విలయతాండవం చేస్తూఉంటే దేవుళ్ళ మీద దెయ్యాలమీద కవిత్వాలు రాసేవాళ్ళు కొందరు...ప్రకృతిని ఆరాధించేవాళ్ళు కొందరు...ఆడవాళ్ళ అంగాంగ వర్ణనలతో ఆనందపడుతూ కొందరు– వీళ్ళందరూ నిజంగా సమాజశ్రేయస్సుకై పాటుపడుతున్న కవులేనా? అయినా వీళ్ళందరికీ సభలకు తక్కువయిందా? సన్మానాలకు లోటయిందా? లేదే? కవులమంటూ కార్లల్లో అట్టహాసంగా తిరుగుతున్నారే? అందరికీ చేతనయింది తనకు వల్లకాకుండా పోతూ ఉంది.

అయితే తనకు చేతగాకుండా పోయిందేమిటి?

అప్పుడు కవిగారి మనసులో రాధాకృష్ణమూర్తి మెదులుతాడు. అతడు తనతో పదేపదే అన్న మాటలు గుర్తుకొస్తాయి.

"కవిగారూ! మీకు తెలియదని కాదు. తన్నుమాలిన ధర్మం వివేకం అనిపించుకోదు. మీరు వసుధైక కుటుంబాన్ని గురించి ఆలోచిస్తూ అసలు కుటుంబాన్ని విస్మరిస్తున్నారు. అది సరైన పద్ధతి కాదు. నా అభిప్రాయంతో మీరు ఏకీభవించకపోవచ్చు. అయినా ఈ సృష్టిని గమనించండి. పరస్పరాధార ఆధేయంగా కొనసాగుతూ ఉందికదా? భాషతో సాహిత్యం... సాహిత్యంతో భాష...నాటకంతో నటుడు...నటుడితో నాటకం...కవిత్వంతో కవి...కవితో కవిత్వం...కొమ్మ ఆధారంతో లత! మరి మీకు ఆధారం ఎక్కడుంది? అందుకే నా మాట వినండి. ఆనాడు కవులు రాజాశ్రయంతో రాణించినట్లే మీరూ ఈనాడు ఒక రాజకీయనాయకుడి ప్రాపు సంపాదించండి"

తన శ్రేయోభిలాషిగా మూర్తిగారు దాదాపు తన చెవుల్లో ఇల్లే కట్టుకొన్నాడు. అయినా అప్పుడు తన చెవికెక్కలేదు. పైగా అదీ ఒక బతుకేనా? అని చీదరించుకొన్నాడు. ఇప్పుడు ఇల్లాలు బాధ్యతలను గుర్తుచేస్తూ అదేపనిగా గిచ్చి రచ్చకీడుస్తూ ఉంటే మూర్తిగారి మాటలు తలకెక్కుతున్నాయి.

తలకెక్కిన భారాన్ని దింపుకోవాలంటే తాను ఇప్పుడేం చేయాలి? అత్యవసరంగా ఒక రాజకీయ నాయకుడి ప్రాపు సంపాదించాలి. అది అంత సులభమా? కాకపోవచ్చు. కానీ తప్పదు. తప్పదనుకొన్నప్పుడు ప్రయత్నం కూడా తప్పదు. తన కోసం కాకపోయినా తన బిడ్డల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అయినా ప్రయత్నించాలి. అయితే ఎవ్వరా రాజకీయ నాయకుడు?

ఎవ్వరైతే తనకేమి? అతడు తన కవితా ప్రతిభను గుర్తించాలి. గుర్తించి గౌరవించాలి. తన ఆర్థిక స్థితిగతులు గ్రహించాలి. సహృదయంగా తన పరిస్థితి మెరుగుపడడానికి సహాయపడాలి. అంటే– అతడు సాహిత్యాభిమానిగా ఉండితీరాలి. అటువంటి వ్యక్తి ఎవరు? ఎవరు? అని కవిగారు ఆలోచనలో పడ్డారు. తలపట్టుకొని కూర్చొని ఆలోచించాడు.లేచి

తిరుగుతూ ఆలోచించాడు. అంత తీవ్రంగా ఆలోచించి ఉంటే అలవోకగా ఒక కవిత అల్లకలిగే వాడేమో కానీ ఎంత ఆలోచించినా కవిగారికి అటువంటి రాజకీయనాయకుడెవరో స్ఫురించలేదు.

దాదావు ఆలోచనాద్వారాలన్నీ మూసుకొన్నాయి. దిక్కూదరీ– తోచడంలేదు. పోనీ డబ్బు సంపాదించే మరోమార్గమా? అసలు తెలియదు. అయితే ఏం చేయాలి? ఆలోచించి ఆలోచించి కవిగారు నీరసపడిపోయాడు. 'రావుల్‌దప్పెను మూర్ఛవచ్చె!' అంటూ గజరాజు ప్రార్థిస్తే శ్రీమన్నారాయణుడే దిక్కయ్యాడట! మరి తనకెవరు? రాధాకృష్ణమూర్తి ఒక్కరే దిక్కు!

ఆలోచన రావడమే తరువాయి! కవిగారు క్షణం ఆలస్యం చేయకుండా మరొక ఆలోచన లేకుండా బయలుదేరాడు. మూర్తిగారిని కలుసుకొన్నాడు.

కవిగారి సమస్య విన్న రాధాకృష్ణమూర్తి ఒక్క నవ్వునవ్వాడు.

ఆ నవ్వు ఒక పజిల్! ఆ నవ్వులోని అంతరార్థం అర్థం కాకుండా ఓటమిని అంగీకరించి నట్టు కవిగారు తలవాల్చేశారు.

"కవిగారూ! ఎంతమంచి గొల్లకైనా వేపకాయంత వెర్రి ఉంటుందంటారు. ఈ సామెతను ఎంత గొప్ప కవికైనా వెలక్కాయంత వెర్రివుంటుందని మార్చి చెప్పుకోవలసిన అవసరం ఏర్పడినట్టుంది. దీన్నే అరచేతిలో వెన్న పెట్టుకొని నేతి కోసం పరుగులు తీయడం అంటారు"

అక్కడికి ఆపి మూర్తిగారు మళ్ళీనవ్వుతున్నారు.

తన అమాయకతమీద పడిన దెబ్బకు కవిగారి తల మరింత వాలిపోవలసిందే కానీ కవిగారు తల పైకెత్తాడు. మూర్తిముఖంలోకి చూస్తున్నాడు మెచ్చుకోలుగా. ఆమాట పడడడానికి తాను అర్హుడైనట్లుగా.

"ఎక్కడిదాకో ఎందుకు కవిగారూ! మన శాసనసభా సభ్యుడు అంటే ఎమ్మెల్యే గారు ఉన్నారు కదా? ఆయన్నే తీసుకోండి. ఎవరో దారినపోతున్న దానయ్య. ఆయన దగ్గరికి వెళ్ళాడట. 'గయోపాఖ్యానం నాటకం ఆడాలి. ఆ నాటకాన్ని తాము ప్రారంభించాలి' అని అడిగాడట. నాటకాన్ని ప్రారంభించడమంటే ఏముంది? ఏబట్టల దుకాణాన్నో లేదా చెప్పులు అంగడిని ప్రారంభించినట్లనుకున్నాడేమో? వెంటనే అంగీకరించడమే కాదు. అప్పటికప్పుడే అయిదువేల రూపాయలు విరాళం ఇచ్చాడట. మరొక సాహితీ సంస్థ ఒక కవిపేర నిధిని ఏర్పాటు చేస్తున్నామంటే 'అది నా విధి!' అంటూ అక్కడికక్కడే పదివేల రూపాయలకు చెక్కు రాసి ఇచ్చాడట!"

"విన్నాను మూర్తిగారూ!"

"విన్నారా?"

"ఆయన వందిమాగధులు కోళ్ళయికూస్తుంటే వినకుండా ఉంటానా?"

"బాగుంది. అయితే విని ఏంచేశారు?"

"ఇందులో నేను చేయడానికేముంది?"

"అందుకే అన్నాను- ఎంత గొప్ప కవికైనా వెలక్కాయంత వెర్రి ఉంటుందని. ఈ రెండు సంఘటనలు...వాటికి జరిగిన ప్రచారాన్నిబట్టి చూస్తే ఆయనకు కళాసాహిత్యాభిమానాలు ఉన్నాయో? లేదో? దేవుడెరుగు. ప్రచారాన్ని కాంక్షిస్తున్నాడని తెలిసిపోతున్నది కదా? కాబట్టి మీరా నాటక ప్రారంభోత్సవానికి పిలవకపోయినా వెళ్ళిఉండాలి. వెళ్ళి ఆయన ఔదార్యం మీద కళాసాహిత్యాభిమానాలపట్ల పంచరత్నాల హారం కట్టి పదిమంది సెభాష్! అనేటట్లుగా చదివి వినిపించి ఆయనకు అందచేసి ఉండాలి.

అప్పుడు ఎమ్మెల్యేగారి చూపు మీమీద పడుతుంది. చూపు పడడంతో గుర్తింపు... గుర్తింపుతో ఒక స్థానం దొరుకుతుంది... ఆ స్థానాన్ని పదిలపరచుకోవడంతో అభిమానం... అభిమానంతో ఆత్మీయత...ఆత్మీయతతతో ఆదరణ! లోకమంతా ఈ పద్ధతికి విధిగా లోబడి ముందుకు దూసుకొనిపోతూ ఉంటే మీరు వెనక నిలబడి చూస్తూ ఉండడం ఎక్కాలనుకొన్న ఎర్రబస్సు ముందుకు దూసుకొనిపోతూ ఉంటే చేతకాని ప్రయాణీకుడు దుమ్మువాత పడినట్లుంది"

విప్లవభావజాల ప్రభావంతో ప్రగతి సాధన అన్న విశాలమైన దృక్పథంలో నిలబడి ఈ సమాజాన్ని చూస్తున్నప్పుడైతే కవిగారు మూర్తిగారి మాటలను చాలా తేలిగ్గా కొట్టిపారేసే వాడు. కానీ ఇప్పుడు సతీమణి పోటుకు ఆ దృక్పథాన్ని అటకెక్కించి సంప్రదాయ సంకెళ్ళను తగిలిస్తే మనసు బాధ్యతదిశగా పరుగులుతీస్తూ ఉంది. ఆ దిశలో మూర్తిగారి మాటలు బలాన్ని పుంజుకొన్నాయి. శూలాలై గుచ్చుతున్నాయి.

కవిగారి ముఖంలో ఆ బాధ ప్రస్ఫుటంగా ప్రతిఫలిస్తూ ఉంది.

మూర్తి గమనించాడు.

"కవిగారూ! తమవంటి కవులు చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకొని ప్రయోజనం లేదని సెలవిచ్చినా తమకు పూర్వం కవులు గతం గతః అన్నా అర్థం ఒక్కటే! కాబట్టి జరిగిపోయినదాన్ని గురించి బాధపడకండి. జరగవలసిందేమో ఆలోచించండి. ఆలోచిస్తే అలాంటి అవకాశాలకు కొదవ ఉండదు"

"ఆలోచించి ఆలోచించి ఆలోచనకందకనేకదా మీ వద్దకు వచ్చింది"

"అయితే వినండి. మన ఎమ్మెల్యేగారి పుట్టినరోజు ఈ రోజు కలుపుకుంటే సరిగ్గా మూడోరోజు. మీకు తెలియదని కాదు. గొప్ప గొప్ప దేశనాయకులు పుట్టింది కూడా ఆరోజే! మూడు పువ్వులంటారో? ఆరు కాయలంటారో? పంచరత్నాలంటారో! నవనవోన్మేష నక్షత్ర మాలికలంటారో? అది మీ ఇష్టం. రాయండి. చక్కని పద్యాలు రాయండి. అంతకంటే అందంగా ఫ్రేం కట్టించండి. పుట్టిన రోజు కాబట్టి ఆయన ఇంట్లోనే ఉంటారు. అందిరికీ అందుబాటులో కూడా ఉంటారు. ఎందరో అభిమానులు కానుకలు...శుభాకాంక్షలు. ఎవరికి తగినట్లు వాళ్ళు. అందుకే మీరూ వెళ్ళండి. ఒక నిమ్మపండు చేతికిచ్చి మీ కవితాగానం చేయండి. ఆ తర్వాత ఏం జరుగుతుందో వచ్చి నాతోచెప్పండి"

'అదెంతపని?' అన్నట్లుగా కవిగారు బయలుదేరారు.

"సిద్ధాంతాలు పరిస్థితుల నిరంతర పోరాటంలో ఎప్పుడు ఏది గెలుస్తుందో? ఏది ఓడుతుందో? అదే మనిషి వ్యక్తిత్వానికి గీటురాయి. అయ్యో పాపం కవిగారు!" అని మూర్తి కవిగారు వెళ్ళినవైపే చూస్తూ అవసరం తెచ్చిన మార్పును గురించి ఆలోచిస్తున్నాడు.

పంచరత్నాల హారాన్ని ఎంత అందంగా కట్టాలో ఆలోచించుకొంటూ కవిగారు ఇల్లుచేరాడు!

'అయిదు పద్యాలు!... కేవలం అయిదు పద్యాలు రాయడం ఎంతసేపు?' అని అనుకొంటూ కవిగారు ఇల్లుచేరాడు. కానీ తీరా రాయడానికి కూర్చున్న తర్వాతకానీ కష్టం తెలిసిరాలేదు. ఎంత ప్రయత్నించినా ఆలోచన పారలేదు. కలం సాగలేదు.

ఏం చేస్తాడు పాపం? అలవాటులేనిపని!

అయినా తప్పదు.

హృదయ స్పందనకు ప్రతిస్పందన అక్షరరూపమే కవిత్వం అంటారు. పాపం కవిగారికి అలాంటి స్పందనకు అవకాశం లేదే?

ఒక వ్యక్తి. అందులో రాజకీయనాయకుడు. అతన్ని పొగడుతూ కవిత్వం! తన సిద్ధాంతానికే పూర్తిగా విరుద్ధం. అయినా అవసరాలు సిద్ధాంతాన్ని పక్కకు నెట్టిన కారణంగా పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

ఆలోచించి ఆలోచించి తల బరువెక్కింది. బరువెక్కిన తల వాలిపోయింది. వాలిపోయిన తలను ప్రయత్నపూర్వకంగా పైకి లేపితే ఎదురుగా 'కూళలకిచ్చి అప్పుడుపుకూడు భుజించుటకంటె సత్కవుల్ హాలికులైననేమి?' అని నిలదీస్తూ పోతనామాత్యుడు. సమాధానం చెప్పలేక మళ్ళీ తలవాలిపోతుంది. ఎంతసేపని అలా ఉంటాడు? తల పైకెత్తితే మళ్ళీ అదే దృశ్యం!

పాపం! కవిగారిచేతిలో కాగితం ముండ్లకంపపై చిగులు కొంటే కలం నిట్టూర్చింది.

సహించలేక పైకి లేచాడు. లేచి ఎక్కడికిపోవాలి?

అప్పుడు తన కనులముందు మెదిలిన వ్యక్తి ధరిత్రి! ధరిత్రి మాట మనసులో మెదిలేసరికి ఆలోచనాతరంగాల్లోపడి తన్నుకు చస్తున్న తనకు ఆధారం దొరికినట్లనిపించింది. కవిగారు బయలుదేరారు. మనసును ధరిత్రి పూర్తిగా ఆవరించింది. ఆవేశంగా నడుస్తున్నాడు. నడుస్తూ ఆలోచిస్తున్నాడు.

"ధరిత్రి! ఎవరు పేరు పెట్టారో ఏమో? ఎంత చక్కని పేరు? పేరు పొసగడం కూడా ఒక అదృష్టమే! ధరిత్రి ఓర్పుకు మారుపేరు. ఈ ధరిత్రి నేర్పుకు మరోపేరు. అది అనితరసాధ్యమైన నేర్పు. అందుకే ఆ ఇంట్లో కవులు... కళాకారులు... రసికులు... రాజకీయ నాయకులు- వాళ్ళూ వీళ్ళు అన్న తారతమ్యం లేదు. అందరికీ స్థానం ఉంది. ఆ స్థానం తనదిగానే ప్రతివాడూ భావిస్తాడు- సమస్తజీవులు సూర్యుణ్ణి తనవాణ్ణిగానే భావించినట్లు! విభిన్న వ్యక్తులు... విభిన్న మనస్తత్వాలు... అందరికీ సమభావన కలిగించడం ఆమెకే చెల్లింది.

ఎంత చిత్రమైన వ్యక్తి?

తన దృష్టిలో ఆమె ఒక దేవత ఆమె ఇల్లు ఒక ఆలయం!

దేవుణ్ణి చూడాలని భక్తులు ఆలయాలకు వెళుతుంటారు. దేవుణ్ణి చూడబోతున్నామన్న అభిలాషతో వాళ్ళ మొగాలు వెలిగిపోతుంటాయి. దర్శనానంతరం తిరిగి వస్తుంటారు. దర్శనం చేసుకొన్న అనుభూతితో అప్పుడూ వాళ్ళమొగాలు వెలిగిపోతుంటాయి. ధరిత్రి ఇంట్లో కూడా అంతే! వచ్చేవాళ్ళు వస్తుంటారు. వెళ్ళిపొయ్యేవాళ్ళు పోతుంటారు. ఎవరిని గమనించినా ఏ ముఖంలో కూడా అసంతృప్తికి తావుండదు. అసూయకు చోటుండదు.

మరీ చిత్రమేమిటంటే?–

ఆలయానికి వెళ్ళే భక్తులందరు దాదాపు ఒకటే కోరికతో వెళుతుంటారు. కానీ ఈ ఆలయానికి వచ్చే రకరకాల భక్తులకు రకరకాల కోరికలు. అందరి కోరికలు తీరుతాయి. రాజకీయనాయకుల అవసరాలు ఆమెకు తెలుసు. రసికుల అభిలాషలు తెలుసు. కవుల కళాకారుల తపన ఏమిటో తెలుసు. ఎవరితో ఎలా స్పందించాలో ఆమెకు అంతకన్నా బాగా తెలుసు. అదే ఆమె ప్రత్యేకత! ఆ ప్రత్యేకతే తనను అక్కడికి నడిపిస్తూ ఉంది.

కొంపలో సాధింపులు సమస్యలతో సతమతమైన తనకు ఆమె సాన్నిధ్యమే ఒక స్పందన! ఆమె తలంపే ఒక మైమరపు! ఆ మైమరపుతోనే కవిగారు ఆమె ఇంట్లో అడుగుపెట్టాడు.

తనకోసరమే ఎదురుచూస్తున్నట్లుగా ఆమె "ఎన్నాళ్ళకెన్నాళ్ళకు? రండి రండి! కవిగారూ దయచేయండి" అంటూ ఆహ్వానించింది.

ఆమె పలకరింపే తన పాలిటికి ఒక పన్నీటి చిలకరింపు అయింది. ఆ చిలకరింపులో సేదదేరినా ఆలోచనాభారం అతని ముఖంలో ప్రస్ఫుటంగా కనిపిస్తూ ఉంది.

"కవిగారేదో చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నట్లుంది."

"అవును ధరిత్రీ!" అంటూ కవిగారు తూగుటుయ్యాలమీద కూర్చున్నాడు.

"కారణం తెలుసుకోవచ్చునా?" అని అడుగుతూ ఆమె ఎదురుగా కూర్చొనింది.

"అలానే కాసేపు కూర్చో చెప్తాను"

ఆమె కూర్చొనింది. గోడలకు తగిలించిన రవివర్మ చిత్రాల్లోని ఒక చిత్రం ప్రాణం పోసుకొని కవిగారి ఎదుట కూర్చున్నట్లు ఆమె కూర్చొనింది. తూగుటుయ్యాల్లో మెల్లగా ఊగుతూ కవిగారు ఆమెవైపు తదేకంగా చూస్తున్నారు. ఆ హాల్లో నిశ్శబ్దంగా కొన్ని నిముషాలు. కవిగారు గొంతు సవరించుకున్నాడు.

మనసు పూవులు పూచెను మావిపైని<br>
కొలువుదీరిన కోయిల కుహుకుహుమనె<br>
మధురనాదాలు వినిపించె మధుపచయము<br>
నీవు పుట్టిన దినమిదే నిజము! నిజము!

"నాపుట్టిన రోజు నాకే తెలియదు. మీకెలా తెలిసింది కవిగారూ!" అంటూ ఆమె పగలబడి నవ్వింది.

"నీ పుట్టినరోజుకాదు. మన ఎమ్మెల్యే గారు పుట్టినరోజు!"

"అయితే బతికిపోయారు"

"అంటే?"

"కవిగారికి ఎమ్మెల్యే దర్శనం దొరికి ఎన్నాళ్ళయింది?"

"నాళ్ళా? కాదు ఏళ్ళు! అప్పుడెప్పుడో ఓట్లు సందర్భంగా"

"ఏళ్ళుగా కనబడకపోతే పోయాడు కనీసం ఎన్నుకున్నవాళ్ళకేమైనా చేశాడా?"

"నా అనుభవానికి రాలేదు. ప్రజలు చెప్పగా వినలేదు"

"అందుకే బతికిపోయారన్నాను"

"అంటే?"

"అంటే– ఆ ప్రజానాయకుడు పుట్టినరోజు. ఈ పవిత్రదినంలో పువ్వులు పూశాయి. కోయిలలు పాడాయి. నెమళ్ళు ఆడాయి– అంటూ నోరువాయిలేని వాటిమీద పడ్డారు కాబట్టి సరిపోయింది. అదే ఈ నియోజకవర్గంలో ప్రజల మొగాల్లో పువ్వులు పూశాయి. పాటలుగట్టి పాడారు. ఆనందంతో గంతులు వేశారు. ఆయన పుట్టిన రోజు పండుగనాడని మీరు అని ఉంటే ఆయన కథ ఏమోకానీ ముందు సున్నంలోకి ఎముక మిగలకుండా ప్రజలు మిమ్మల్ని మాత్రం చావగొట్టి ఉంటారు. అందుకే బతికిపోయారన్నాను"

కవిగారి తల గిర్రున తిరిగింది.

"ధరిత్రీ! అక్షరాలతో లక్షలు కాకపోయినా బతుకు చక్కబెట్టుకోవాలని ఆత్మవంచనకు పాలుపడ్డాను. అక్షరలక్షలు చేసే మాటతో నాకు కనువిప్పు కలిగించావు!" అని ఆలోచిస్తూ కవిగారు ఆమెవైపు ఆరాధనాభావంతో చూస్తున్నారు.

ఆమె ప్రక్కన పోతన! పోతన ప్రక్కన ధూర్జటి! ధూర్జటి ప్రక్కన అన్నమయ్య! తనవైపే చూస్తూ చిరునవ్వులు చిందిస్తున్నారు.

కవిగారి తలవాలిపోయింది.

మనసులో పుట్టిన పద్యం కన్నీరుగా మారి ముత్యాలుగా రూపాంతరం చెంది ఆమె పాదాలను అభిషేకిస్తున్నట్లు పలపల రాలుతున్నాయి! ●

స్వాతి మాసపత్రిక
(1, డిశంబర్, 1993)